# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 14-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మహాకుంభ మేళా ఐక్యత, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
2. **స్వర్ణాంధ్ర సాధనకు 10 సూత్రాలతో విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **హరిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్ నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.**
5. **ఈ రోజు నుండి వారంరోజుల పాటు ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.**

==========================

మహాకుంభ మేళా 2025 ఐక్యత, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 5 వేల 5వందల కోట్ల రూపాయతో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కి అసలైన ఉదాహరణగా కుంభమేళా నిలుస్తుందని చెప్పారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..34 సెకన్లు

--------------------------

స్వర్ణాంధ్ర సాధనకు 10 సూత్రాలతో విజన్ డాక్యుమెంట్ 2047ను రూపొందించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో ఏర్పాటు చేసిన సభలో 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి నిన్న ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ

వాయిస్ .....32 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతుల పోరాటం విజయవంతమైందని ఆ పార్టీ అధ్యక్షులు, వైయస్ జగన్మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా తెలియజేశారు. ఏటా పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న 20 వేల రూపాయాలను ఇవ్వడం లేదని, ధాన్యం కొనుగోళ్లను మధ్యవర్తులకు, మిల్లర్లకు అప్పగించడం వల్ల నష్ట పోతున్నామని రైతులు ప్రశ్నిస్తున్నారని జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

హరిత విద్యుత్.. గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి విద్యుత్ అభివృద్ధి సంస్థ–టిజిఆర్ఈడిసీఓ రూపొందించిన విద్యుత్ పొదుపు క్యాలెండర్–2025ను హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఉప ముఖ్యమంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈరోజు నుంచి వారం రోజుల పాటు విద్యుత్ పొదుపు వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేయాలని నిర్ణయించామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. వంద రోజుల ప్రణాళిక, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మంత్రి నిన్న ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్బంగా నారా లోకేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోతోందని అన్నారు. ప్రవేశాలు పెంచేందుకు గ్రామాల పరిధిలోని బడిఈడు పిల్లల సమాచారంతో రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. బదిలీల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు, పదోన్నతులు నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మూడు స్థానాలకు తెలుగు దేశం పార్టీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్ బాబు, భారతీయ జనతా పార్టీ నుంచి ఆర్.కృష్ణయ్య మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు నిన్నటితో ముగియడంతో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన ఆ ముగ్గురు రాష్ట్ర శాసనసభలో రిటర్నింగ్ అధికారి వనితారాణి నుంచి ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.

---------------------------

తెలంగాణలో గ్రూప్–2 పరీక్షలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ –టీజీపీఎస్సీ రేపు, ఎల్లుండి నిర్వహించనుంది. పరీక్షల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 13 వందల 68 కేంద్రాలను ఏర్పాటు చేసింది. 783 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబరు 29న ప్రకటన జారీ చేయగా 5 లక్షల 51 వేల 943 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు రెండు విడతలుగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు ఉంటాయి. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు గేట్లు మూసివేస్తామని టీజీపీఎస్సీ ఇప్పటికే స్పష్టం చేసింది. హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వం జారీచేసిన ఫొటో గుర్తింపుకార్డు తీసుకురావాలని తెలిపింది.

---------------------------

మానవుని దైనందిన జీవితంలో కీలక భూమిక పోషించే ఇంధన వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు నుండి వారం రోజుల పాటు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. ఇందులో భాగంగా ఇంధన సామర్థ్య కార్యక్రమాలను ప్రోత్సహించడం, ఇంధన పొదుపుని పెంపొందించడం, ప్రభుత్వ, ప్రైవేటు తదితర అన్ని సంస్థలలో విద్యుత్, ఇతర ఇంధన వనరులపై చేసే వ్యయాన్ని తగ్గించడం వంటి అంశాలపై అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 20 వ తేదీ వరకు ఇంధన అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయి.

---------------------------

ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు చేసేందుకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేట విద్యుత్ శాఖ కార్యాలయంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల గోడ పత్రికలను మంత్రి నిన్న విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు నుండి వారం రోజుల పాటు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహించనున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సౌర ఫలకాలను ఇంటిపై ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫలకాల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో త్వరలోనే రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా నిజాం సాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీటిని మంత్రి నిన్న విడుదల చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రైతులు పండించిన సన్నాలకు 500 రూపాయలు అదనంగా ఇస్తామని హామీ ఇచ్చారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు వచ్చే ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అన్నారు. ఖరీఫ్ పంటకాలంలో తెలంగాణలో రికార్డు స్థాయిలో పంటలు సాగు అయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను తెలంగాణ ప్రభుత్వం నెర వేరుస్తుందని గృహనిర్మాణ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ళను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ళ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఎవరు ఇల్లు వారే నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇంటి నిర్మాణానికి మొదటి విడతగా లక్ష రూపాయలు జమ చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా  నరసరావుపేటలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన బ్లడ్ బ్యాంకును ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,గ్రామ స్థాయిలో రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. జిల్లా ఆసుపత్రిలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని, సీఎస్ఆర్ నిధులతో ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి తెలియజేశారు.

---------------------------

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చించలేదని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, లగచర్ల రైతుకు పోలీసులు బేడీలు వేసిన ఘటనపై  అధికారులకు ఫోన్ చేసి వివరాలు కనుక్కొన్నట్లు తెలిపారు. రైతుపై కొందరు పోలీసులు తీవ్ర నేరాలతో కూడిన కేసులు నమోదుచేసినట్లు తెలిసిందని, ఆ పోలీసులను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

=======================